ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 6 ఏప్రిల్ 2024



బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

పార్వతీపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ శోభిక పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారిత అధికారి గయాజుద్దీన్ తదితరులున్నారు.



ప్రలోభాలు.. బెదిరింపులు

- రాజీనామా చేయాలని వలంటీర్లపై తీవ్రమైన ఒత్తిళ్లు
- తమకు అనుకూలంగా పనిచేయాలంటున్న అధికార పార్టీ నేతలు
- తాయిలాలతో మచ్చికకు యత్నం.. వినకుంటే హెచ్చరికలు
- వాటికి దూరంగా కొందరు వలంటీర్లు
- టీడీపీ అధినేత చంద్రబాబు భరోసాపై అంతర్గతంగా చర్చ
- కూటమి ప్రభుత్వం వస్తే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని ఆశాభావం

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)


'మీకు మంచి జరిగిందనిపిస్తే.. వైసీపీకి ఓటు వేయండి' అని ముఖ్యమంత్రి జగన్ బహిరంగంగా ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. అయితే మరోవైపుగా వలంటీర్లను పావులుగా వాడుకుంటున్నారు. రాజకీయాలకు వారిని బలిచేస్తున్నారు. ఓటమి భయంతో.. వలంటీర్లకు ఉన్న పరిచయాలతో ఓట్లు దండుకోవాలని వైసీపీ నేతలు యోచిస్తున్నారు. ఇందు కోసం జిల్లాస్థాయిలో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తాయిలాలు, ప్రలోభాలతో బరితెగిస్తున్నారు. రాజీనామాలు చేసి వైసీపీకి సేవలు చేయాలని వంటీర్లపై ఒత్తిడి చేస్తున్నారు. తామే పోస్టులు వేశాం, చెప్పినట్టు రాజీనామా చేయాలంటున్నారు. దీంతో కొందరు వలంటీర్లు ఎటూ తేల్చుకోలేక సతమతమవుతున్నారు. తమను రాజకీయాల్లోకి లాగి ఇబ్బందులకు గురి చేయొద్దని చాలా మంది వలంటీర్లు విన్నవించుకుంటున్నారు. అయినా సరే కొందరు వైసీపీ నేతలు వినడం లేదు. దుస్తులు, డబ్బులు తదితర తాయిలా లతో వలంటీర్లను మచ్చిక చేసుకునేందుకు యత్నిస్తున్నారు. వాటికి కొందరు వలంటీర్లు దూరంగా ఉంటున్నారు. వైసీపీ కార్యకర్తల్లాంటి వలంటీర్లు మినహా మిగిలిన వారంతా వలంటీరు పోస్టులను వదులుకునేందుకు ససేమిరా అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాజీనామా చేసిన వలంటీర్లకు భవిష్యత్ ఉండకపోవచ్చనేది వారి భావన. ప్రజావాణి చూస్తే ప్రభుత్వంపై సానుకూలత లేదని, భవిష్యత్‌లో మేలు జరుగుతుందని అనుకోలేమని అభిప్రాయపడుతున్నారు. అయినప్పటికీ కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు వారిపై ఒత్తిడి తెస్తున్నారు. రాజీనామా చేసి.. జగనన్నకు అనుకూలంగా ప్రచారం చేయాలని ఆదేశిస్తున్నారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే.. వలంటీర్లగా తిరిగి నియమిస్తామని చెబుతున్నారు. అప్పటికీ వినకుంటే వారి కుటుంబ సభ్యులు, బంధువులతో చెప్పిస్తున్నారు. దీంతో ఏమి చేయాలో తోచక, ఎవరితో చెప్పుకోవాలో తెలియక వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. అధికార పార్టీ చెప్పినట్లు చేయాలా? లేక మిన్నకుండిపోవాలా? అని కొందరు మథనపడుతున్నారు. ఇంకొంతమంది మాత్రం రాజీనామా చేసేందుకు ససేమిరా అంటున్నారు. వైసీపీ ప్రభుత్వం తమకేమైనా పార్టీ నిధుల నుంచి వేతనాలు ఇచ్చిందా? ఆ పార్టీ కోసం తమ భవిష్యత్తును చేసుకోవాల్సిన అవసరం ఏమిటని మరికొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు.

చంద్రబాబు భరోసాతో..

వలంటీర్ల వ్యవస్థకు తాము వ్యతిరేకం కాదని, ప్రభుత్వ సొమ్ముతో గౌరవ వేతనం పొందుతున్న వారు ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలందించాలని ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. అధికారంలోకి వస్తే.. వలంటీర్ల విద్యార్హతను బట్టి ప్రభుత్వ ఉద్యోగులతో పాటు బంగారు భవిష్యత్తు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. దీంతో జిల్లాలో అనేకమంది వలంటీర్లు వైసీపీ రాజకీయాలకు దూరంగానే ఉంటున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైతే తమకు బంగారు భవిష్యత్ ఉంటుందని విద్యావంతులైన వలంటీర్లు భావిస్తున్నారు. ఇటువంటి వారంతా ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో సుమారు 5,200 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వీరిలో కేవలం 11 మంది ఈ నెల 5న వీరఘట్టం మండలం చిదిమి గ్రామం నుంచి రాజీనామా చేస్తున్నట్టు ఎంపీడీవోకు లేఖలు అందించారు. ఈ లేఖలు జిల్లా అధికారులకు చేరాయి. వారు మినహా జిల్లాలో ఎక్కడ కూడా వలంటీర్లు రాజీనామా చేయలేదు. మరోవైపు వైసీపీ సర్కారుకు అనుకూలంగా పనిచేస్తున్నారన్న ఆరోపణలతో జిల్లాలో సుమారు 13 మంది వలంటీర్లను అధికారులు విధుల నుంచి తొలగించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లాలో కొందరు వలంటీర్లు జాగ్రత్తగా ఉన్నప్పటికీ వైసీపీ నాయకులు మాత్రం వారిపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే పార్వతీపురం మండలంలో అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో కొందరు వలంటీర్లు దివ్యాంగుల అనుమతులు లేకుండా వారి నుంచి పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు స్వీకరించారు. దీంతో అధికారులు దర్యాప్తు నిర్వహించి ఆయా వలంటీర్లను విధుల నుంచి తొలగించారు. పార్వతీపురం నియోజకవర్గం చిన్నబొండపల్లి గ్రామంలో ఇదే అంశంపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై ఇప్పటివరకు ఎటువంటి చర్యలు లేవు. రేపు..మాపో.. రాష్ట్ర , కేంద్ర ఎన్నికల సంఘానికి ఆధారాలతో సహా ఫిర్యాదులు వెళ్లనున్నాయి. ఇటువంటి ఫిర్యాదులు అక్కడి వరకు వెళ్తే.. పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. దీంతో జిల్లాలో కొందరు వలంటీర్లు అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. కాగా వైసీపీ నేతలు చెప్పిందల్లా చేస్తే.. ఎటువంటి కష్టాలు ఎదురవుతాయోనని మరికొందరు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. మొత్తంగా జిల్లాలోని అనేక మంది వలంటీర్లు రాజీనామా చేసేందుకు ఇష్టపడడం లేదు.







ఉదయం 11 గంటలకే జిగిరాం వద్ద హైవే ఇలా..

నిప్పుల కుంపటి

- జిల్లాలో మండుతున్న ఎండలు
- విలవిల్లాడుతున్న ప్రజలు

సాలూరు రూరల్/మక్కువ: జిల్లాలో ఎండలు మండుతున్నాయి. రోజూ 42 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడగాలుల తీవ్రత , ఉక్క పోతతో జిల్లావాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మొత్తంగా అధిక ఎండలతో జిల్లా నిప్పుల కుంపటిగా మారింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు రాలేని పరిస్థితి. రాత్రి ఏడు గంటలైనా వాతావరణం చల్ల బడడం లేదు. జిల్లాలో 15 మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఉదయం పది గంటల తర్వాత ప్రధాన రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మరోవైపు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లోనూ శుక్రవారం 42 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రి వేళల్లో 36 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదవగా.. జిల్లావాసులు అల్లాడిపోయారు. వృద్ధులు, చిన్నారులు విలవిల్లాడిపోయారు. రాత్రియినా వేడి తగ్గకపోవడంతో తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. మరోవైపు సరుకు రవాణా చేసే వాహన చోదకులు, చిరు వ్యాపారులు, కూలీలు సైతం నానా అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం వేళల్లో చెట్ల వద్దకు పరుగులు తీశారు. మరికొందరు శీతలపానియాలు తాగి కాస్త ఉపశమనం చెందారు. కాగా మరి కొద్ది రోజుల పాటు ఎండలు అధికంగానే ఉంటాయని విపత్తుల నిర్వహణ సంస్థ సైతం ప్రకటించిన నేపథ్యంలో జిల్లావాసులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఫోరెన్సిక్ నిపుణుడు డాక్టర్ సంజీవనాయుడు సూచించారు. వివిధ పనులపై బయటకు వచ్చే వారు తగిన సంరక్షణ చర్యలు పాటించాలన్నారు.



నిర్మానుష్యంగా మక్కువ ప్రధాన రహదారి

రేషన్‌లో కోత

- రాగిపిండి తీసుకుంటే కేజీ బియ్యం కట్
- ఈ నెల నుంచే అమలు
- ఆందోళనలో కార్డుదారులు

సీతంపేట: జిల్లాలో కార్డుదారులకు రేషన్‌లో కోత విధిస్తున్నారు. రాగిపిండి తీసుకుంటే.. కేజీ బియ్యం కట్ చేస్తున్నారు. ఈ నెల నుంచే ఈ విధానం అమలు చేస్తుండడంతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవంగా ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులల కింద బియ్యంతో పాటు పంచదార అందజేస్తున్నారు. ఒక్కోనెల బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, గోధుమపిండిని కూడా పంపిణీ చేసేవారు. అయితే ఈ నెల కోటాలో కందిపప్పునకు బదులుగా కేజీ రాగిపిండిని రూ.11 రూపాయలకు సరఫరా చేయాలని సివిల్ సప్లయిస్ అధికారులు నిర్ణయించారు. దీనిలో భాగంగా కేజీ రాగిపిండి తీసుకున్న కార్డుదారులకు కేజీ బియ్యాన్ని తగ్గించాలని ఆదేశాలు జారీ చేశారు. అసలు రేషన్‌కార్డులో ఉన్న ఒక్కో సభ్యునికి ఐదు కిలోల చొప్పన బియ్యం అందించాల్సి ఉంది. అయితే తాజా ఆదేశాల ప్రకారం.. కుటుంబంలో ఎంతమంది ఉన్నా.. కిలో రాగి పిండిని విధిగా తీసుకోవాల్సి ఉంది. ఇదే సమయంలో ఐదు కిలోల బియ్యంలో కేజీ వరకు కోత విధిస్తున్నారు. అంటే రేషన్ కార్డుదారుడు కిలో రాగిపిండి తీసుకుంటే... నాలుగు కిలోల బియ్యమే అందిస్తున్నారు. దీనిపై కార్డుదారులు మండిపడుతున్నారు. గతంలో టీడీపీ హయాంలో ఈ పరిస్థితి లేదని.. నిత్యావసర సరుకుల్లో కోత విధించడం ఏమిటని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు సీతంపేట మండలంలో 15 వేల 650 రేషన్ కార్డుదారులు ఉండగా, ఇప్పటికే 15 టన్నుల రాగి పిండి, ఆయా స్టాక్ పాయింట్లలో అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. అయితే గిరిజన ప్రాంతాల్లో చోడి పంట ఆదివాసీలు పెద్ద ఎత్తున సాగుచేస్తున్న తరుణంలో రాగిపిండిని పంపిణీ చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రేషన్‌కార్డుదారుడు రాగిపిండిని విడిపించని పక్షంలో జీసీసీ సేల్స్‌మేన్లు ఈ భారం మోయాల్సిన పరిసితి ఏర్పడింది. ఈ విషయమై సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ మధుసూదనరావును వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. రాగి పిండి తీసుకున్న వారికి కేజీ బియ్య కోత విధించడం మాట వాస్తవమేనన్నారు. కార్డుదారులు విధిగా రాగి పిండి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.



సీతంపేటలో సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం



క్రీడా మైదానం కాదండోయ్..

ఈ ఫొటో చూసి క్రీడా మైదానం అనుకుంటే పొరబడినట్టే. ఇది సాలూరు మండలం అన్నంరాజువలస వద్ద చెరువు. నిత్యం జలకళతో నిండుగా ఉండే ఈ చెరువు ఈ ఏడాది తొలి వారానికే పూర్తిగా ఎండిపోయింది. ఎండల తీవ్రతకు చుక్క నీరు కూడా పరిస్థితి. పూర్తిగా క్రీడా మైదానంగా మారిన ఈ చెరువు గర్భంలో ప్రస్తుతం ఆ గ్రామ యువత క్రికెట్ తదితర ఆటలాడుకుంటున్నారు. కానీ గ్రామస్థులు మాత్రం ఆవేదన చెందుతున్నారు. చెరువు ఎండిపోవడంతో సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదంటూ వాపోతున్నారు.

- సాలూరు రూరల్



వంద పడకల ఆసుపత్రి భవనాల నిర్మాణం ఇలా..

ఇంకెప్పటికో?

- నాలుగేళ్లు గడుస్తున్నా.. పూర్తికాని నిర్మాణాలెన్నో..
- సకాలంలో బిల్లులు చెల్లించని వైసీపీ సర్కారు
- మొండి గోడలతో దర్శనమిస్తున్న భవనాలు
- అందుబాటులోకి రాని సేవలు
- పెదవి విరుస్తున్న ప్రజలు

(సాలూరు, ఏప్రిల్ 5)

'ఐదేళ్ల కాలంలో అభివృద్ధి , సంక్షేమానికే పెద్దపీట వేశాం.. ఇందుకోసం కోట్లాది రుపాయలు వెచ్చించాం' అని వైసీపీ సర్కారు గొప్పలు చెబుతున్న విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వ ప్రకటనలకు .. క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన కుదరడం లేదు. సాక్షాత్తూ.. ఉపముఖ్యమంత్రి పి.రాజన్నదొర నివాసం ఉండే సాలూరులో నెలకొన్న పరిస్థితే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. వైసీపీ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల.. పట్టణంలో ఎన్నో అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నాలుగేళ్లు గడుస్తున్నా.. వాటికి అతీగతీ లేదు. అవి ఎప్పటికి పూర్తవుతాయి.. ఇంకెప్పటికి అందుబాటులోకి వస్తాయన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. సాలూరు పట్టణంలోని ప్రభుత్వ భవన నిర్మాణాల పరిస్థితిని ఇప్పుడు తెలుసుకుందాం.

వంద పడకల ఆసుపత్రి నిర్మాణం ఇలా..

పట్టణ ప్రజల చిరకాల కోరిక వంద పడకల ఆసుపత్రి నిర్మాణం. దీని పనులు ప్రారంభించి సుమారు నాలుగేళ్లు గడుస్తున్నా.. ఇంతవరకు పూర్తవలేదు. పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదు. ఈ భవనాల నిర్మాణానికి 2019లో కేంద్రప్రభుత్వం రూ.17 కోట్లు మంజూరు చేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన చేశారు. అయితే ఇంతలో ఎన్నికలు రావడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మారింది. ఈ మేరకు 2020 డిసెంబరులో మరోసారి వైసీపీ ప్రజాప్రతినిధులు వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన చేశారు. అయితే నేటికీ పనులు తుది దశకు చేరుకోకపోవడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. వాస్తవంగా సాలూరు ఏరియా ఆసుపత్రికి రోజూ సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలతో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన ఎంతో మంది రోగులు వస్తుంటారు. ప్రధానంగా గిరిజనులంతా ఇక్కడకే వచ్చి వైద్య సేవలు పొందుతుంటారు. సీజన్ వ్యాధులు ప్రబలే సమయంలో అయితే ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతుంది. దీంతో ప్రస్తుతం ఆసుపత్రిలో ఉండే 30 పడకలు ఏ మాత్రం చాలడం లేదు. ఒక్కో మంచంపై ఇద్దరేసి చొప్పున రోగులు సర్దుకోవాల్సిన పరిస్థితి. మరికొందరికి వరండాలో, బెంచీలపైనే వైద్యసేవలు అందించాల్సి వస్తోంది. వసతి సమస్య కారణంగా ఆసుపత్రిలో పనిచేసే సిబ్బందికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా వంద పడకల ఆసుపత్రి ఎంతో అవసరమైనా.. దానిపై వైసీపీ సర్కారు దృష్టి సారించలేదు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ప్రస్తుతం ఆయా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేసి వంద పడకల ఆసుపత్రిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మరికొన్నింటి పరిస్థితి ఇదీ..

- సాలూరు రైల్వేస్టేషన్ రోడ్డులో ఆర్‌అండ్‌బీ శాఖ అతిథి గృహం నిర్మాణానికి నాలుగేళ్ల కిందట శ్రీకారం చుట్టారు. అయితే బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ గతేడాది ఆ పనులను నిలిపివేశారు. అయితే కోడ్‌కు ముందు బిల్లులు మంజూరు చేయడంతో హడావుడిగా మళ్లీ పనులు ముమ్మరం చేశారు.
- మున్సిపల్ నిధులతో 24వ వార్డు ఎరుకల వీధిలో రూ.6 లక్షలతో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లకు సంబంధించిన పైపు లైన్లు వేయలేదు. సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం జరగలేదు. దీంతో అది నిరుపయోగంగా మారింది.
- బంగారమ్మపేట ఎస్టీ బాలుర వసతి గృహం వద్ద రూ.50 లక్షలతో భోజన, వంటశాల భవన నిర్మాణాలను నాలుగేళ్ల కిందట ప్రారంభించారు. అయితే సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆయా పనులన్నీ ముందుకు సాగడం లేదు. దీంతో వసతి గృహంలో వంటా-వార్పునకు ఇబ్బందులు తప్పడం లేదు.
- 2020లో గుమడాం వైటీసీకి సమీపంలో రూ.80లక్షలతో పట్టణ ఆరోగ్యకేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తి కావస్తున్నా.. బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఓ అద్దె గృహంలోనే ఇంకా ఆరోగ్యం కేంద్రం నిర్వహించాల్సిన వస్తోంది. దీంతో రోగులు, సిబ్బందికి నిత్యం అవస్థలు తప్పడం లేదు.



సగంలో నిలిచిపోయిన అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణం

లేబర్ కనిపించట్లే..

వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి సంబంధించి లేబర్ ఎవరూ కనిపించడం లేదు. పనులేవీ జరగనట్లుగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఏఈ, డీఈ చూసి వెళ్తున్నట్లు తెలిసింది.

- రత్నకుమారి, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి సాలూరు

బిల్లుల చెల్లింపుల్లేక..

సాలూరులో వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు నిలిచిపోయిన మాట వాస్తవమే. వైసీపీ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడమే ఇందుకు కారణం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం.

- నరేంద్రరెడ్డి, డీఈ, సాలూరు

పెండింగ్‌లో ఉన్నాయి

సాలూరు పట్టణంలోని 24వ వార్డులో నిర్మించిన సాముహిక మరుగుదొడ్లకు సంబంధించి కొద్ది పాటు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలో వాటిని పూర్తి చేయిస్తాం.

- సూరినాయుడు, ఏఈ, సాలూరు మున్సిపాల్టీ

విజయనగరంలో 'మహిళా మేలుకో'

విజయనగరం రూరల్: ఐదేళ్ల ప్రభుత్వ హయాంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగాయని, వీటిని నియంత్రించలేని వైసీపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని కోరుతూ విజయనగరంలో టీడీపీ మహిళా విభాగం చేపడుతున్న 'మహిళా మేలుకో' కార్యక్రమం 20, 40, 41 డివిజన్ల పరిధిలో జరిగింది. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని టీడీపీ మహిళా విభాగం నాయకులు అనురాధ బేగం, పత్తిగిల్లి సూర్యకుమారి తదితరులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా విభాగం నాయకులు మురిపెన పద్మలత, వీరలక్ష్మి, సుంకరి సునీత, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ

బొబ్బిలి: పట్టణపరిధిలోని రావువారివీధికి చెందిన జగ్గారావు అనే నిరుపేదకు బొబ్బిలి నేనుసైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బొంగు సంతోష్ నెలకు సరిపడా నిత్యావసర సరుకులను శుక్రవారం వితరణగా అందజేశారు. బియ్యం, పప్పులు, వంటనూనె తదితర సామగ్రిని ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బొత్స అప్పులు చేతుల మీదుగా అందజేశారు.

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం రూరల్: ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాకోడు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ శ్రావణి చెప్పారు. శుక్రవారం తన ఛాంబర్లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉష్ణోగ్రతలు క్రమేణా పెరుగుతూ వస్తున్నాయని, మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకూ అత్యవసరం అయితే, తప్ప ఎండలోకి వెళ్లకుండా ఉండాలన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రాకోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన అవగాహన సదస్సుల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సమావేశంలో రాకోడు పీహెచ్‌సీ వైద్యురాలు బంగారు అఖిలతో పాటు, రాకోడు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

8న ఏపీజీఎల్ఐ పాలసీ వివరాలు

కలెక్టరేట్: జిల్లా ఖజానా కార్యాలయాల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు ఏపీజీఎల్ఐ పాలసీ వివరాలు, ధృవపత్రాలను ఈనెల 8వ తేదీన పొందవచ్చని జిల్లా ఖజానా అధికారి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజున జిల్లా ఇంటిగ్రేడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్‌కు హాజరు కావాలని సూచించారు.

రాజాంలో జయహో బీసీ

రాజాం: వైసీపీ పాలనలో 50 శాతంపైగా ఉన్న బీసీలు దగా పడ్డారని కోండ్రు మురళీ అన్నారు. శుక్రవారం రాత్రి కొండకవీధిలో జహో బీసీ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి కనీసం ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు చేయలేదన్నారు. నా ఎస్టీ నా బీసీ అంటూ అన్ని సామాజిక వర్గాలకు అన్యాయం చేశారన్నారు. బీసీల ఐక్యత ఎలా ఉంటుందో ఈ ఎన్నికల్లో చూపించి తగిన గుణపాఠం చెప్పాలన్నారు

మత్స్యకారుల ఎన్నికల ప్రచారం

రాజాం: రాజాం మండలం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మత్యకారులు శుక్రవారం సంఘం అధ్యక్షుడు బేహర తౌవుడు అధ్వర్యంలో మండలంలో బొద్దాం, పెనుబాక, మారెడుబాక గోపాలపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే మత్యకారులకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందన్నారు. 250 మంది వరకు ఈ ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మేకల నాగన్న దొర, సెక్రటరీ మేకల పోతయ్య, మేకల రాము, బొండపల్లి అప్పన్న దొర తదితరులు పాల్గొన్నారు

ఆలయాల సందర్శన

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామంలో, పట్టణంలోని గొల్లపల్లిలో నూతనంగా నిర్మించిన షిర్డీసాయిబాబా, రామమందిరాలను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గొల్లపల్లి వేదపండితులు భల్లమూడి సుందరశర్మ, వేమకోటి మన్మథరావు ఆధ్వర్యంలో సీతారామచంద్రమూర్తి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వైసీపీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు కూడా ఈ రెండు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.

టీడీపీతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

తెర్లాం: మండలంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బేబీనాయన ఆదేశాల మేరకు శుక్రవారం పూనువలస, చీకటిపేట, కె. సీతారాంపురం, గ్రామాల్లో బాబు సూపర్ సిక్స్ పథకాలపై ఆయా గ్రామ టీడీపీ నాయకులు అవగాహన కల్పించారు. గడప గడపకూ వెళ్లి అవగాహన కల్పించారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన పథకాలను ఒక్కొక్కటిగా వివరిస్తూ జగన్ చేసే మోసాలను తెలియజేశారు. రాబోయే ఏన్నికల్లో వైసీపీని ఓడించాలని, చంద్రబాబు రాకపోతే రాష్ట్రం అదోగతి పడుతుందని, అందుచేత ప్రతి ఒక్కరు ఈ విషయాన్ని గమనించి,టిడిపి కి ఓటు వేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఆ గ్రామ టీడీపీ నాయకులు చీకటి తిరుపతి రావు, మామిడి బాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

● జేఎన్‌టీయూ వీసీ సుబ్బయ్య

విజయనగరం రూరల్, ఏప్రిల్ 5: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగజ్జీవన్‌రామ్‌ని జేఎన్‌టీయూ వీసీ వెంకటసుబ్బయ్య కొనియాడారు. బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అణగారిన వర్గాన్ని అభ్యున్నతిలోకి తీసుకువచ్చిన పోరాట యోధుడు, దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన నాయకులని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి జయసుమ, ఆర్ రాజేశ్వరరావు, కె బాబులు, ప్రిన్సిపాల్ శ్రీకుమార్, వైఎస్ ప్రిన్సిపాల్ గురునాథ, కో-ఆర్డినేటర్ సౌభాగ్యలక్ష్మితో పాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షురాలిగా ఆదిలక్ష్మి

జామి: మండల బీజేపీ అధ్యక్షురాలిగా రాయవరపు ఆదిలక్ష్మిని నియామిస్తూ విశాఖ బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.రవీందర్ నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు ఇచ్చిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి అభ్యర్థి విజయానికి చిత్తశుద్ధితో కృషిచేస్తామని, పార్టీ బలోపేతానికి తనవంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. మండలంలో బీజేపీని గ్రామస్థాయి నుంచి బలపరిచే చర్యలు జిల్లా నాయకుల ఆధ్వర్యంలో చేపడతామని తెలిపారు. ఈమె నియామకంపై బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తంచేశారు.

ఇదేనా సుందరీకరణ?

● పాడైన డస్ట్‌బిన్‌లు.. ఎక్కడి చెత్త అక్కడే



సుందరీకరణ చేసిన బలిజిపేట రోడ్డులో ఇలా..

బొబ్బిలి, ఏప్రిల్ 5: బొబ్బిలి పట్టణంలో కోట్లాది రూపాయలను వెచ్చించి సుందరీకరణ పనులు చేపట్టామని వైసీపీ నాయకులు తరచుగా ప్రతి వేదికపైనా గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ సుందరీకరణ కేవలం పేరులో తప్ప పట్టణంలో ఎక్కడా కానరావడం లేదు. బలిజిపేటరోడ్డులో, మరికొన్ని చోట్ల సుందరీకరణ పేరుతో ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారు. కానీ అక్కడి రోడ్లప చెత్త కుప్పలను మాత్రం అలానే వదిలేస్తున్నారు.

పట్టణంలో తాండ్రపాపారాయ జంక్షన్, శ్వేతాచలపతి స్కూలు, బజారు సెంటరు, జంగాల శివాలయం సెంటరు ఇలా పలు కూడళ్లలో 30 వరకు ఐరన్ డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశారు. వాటిలో చాలామట్టుగా పాడైపోవడంతో అక్కడ చెత్త పేరుకుపోయి పశువులు, పందులకు మేతలా ఉపయోగపడుతున్నాయి. చెత్త కుండీల వ్యవస్థను గతంలో ఎత్తివేసి, ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియను పగడ్బందీగా అమలు చేస్తామని పాలకవర్గం, అధికారులు ఇచ్చిన హామీలు ఆచరణలో ఫెయిలైపోయాయి. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను పట్టణంలోని పలు చోట్ల పెద్దఎత్తున కుండీల్లో కుప్పలుగా పోస్తున్నారు. ఒక్క బలిజిపేట రోడ్డులో సుందరీకరణ జరిగిన ప్రాంతంలోనే రెండు చోట్ల ఇలా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. సుందరీకరణ పనులను వెక్కిరిస్తున్నట్లు ఈ చెత్తాచెదారాలు కనిపిస్తుండడం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సుందరీకరణ అంటే ఇదేనా? అని ఎగతాళి చేస్తున్నారు. సుందరీకరణ మాటెలా ఉన్నా, చెత్తాచెదారాలతో పరువుపోకుండా చూడాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

పాడైన డస్ట్‌బిన్లకు మరమ్మతు చేయిస్తున్నాం

పట్టణంలో సుమారు 20కి పైగా డస్ట్‌బిన్లు పాడైపోయాయి. వాటికి సొంత బాధ్యత తీసుకొని మరమ్మతు చేయిస్తున్నాం. త్వరలో ఈ సమస్య సమిసి పోతుంది. ఎలక్ట్రికల్ ఆటోలను కూడా రంగంలోకి దింపుతున్నాం. పారిశుధ్య కార్మికులే వాటిని స్వయంగా నడిపి వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నాం.

-సోమేశ్వరరావు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్, బొబ్బిలి

నమ్మించి నట్టేట ముంచిన జగన్

● ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు



నగరంలోని 29 వ డివిజన్‌లో అదితి ఇంటింటి ప్రచారం

విజయనగరం రూరల్, ఏప్రిల్ 5: రాష్ట్ర ప్రజలను వైఎస్ జగన్మోహన్ రెడ్డి నమ్మించి నట్టేట ముంచారని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు చెప్పారు. టీడీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా నగరంలోని 29 వ డివిజన్ పరిధిలోని ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్ నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆమెకు, టీడీపీ శ్రేణులకు ఆయా డివిజన్ ప్రజలు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి.. ఈ సందర్భంగా ఆదితి గజపతిరాజు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిని జగన్ పట్టించుకోలేదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, టీడీపీ కూటమికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ● బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం పేరిట టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు నగరంలోని 8వ డివిజన్ పరిధిలో లక్కపందిరి వారు వీధి, శంకరమఠం, పత్తిపాటివారి వీధి తదితర ప్రాంతాల్లోని బ్రాహ్మణులు ఇంటికి వెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరుతూ ప్రచారాన్ని నిర్వహించారు. ● బీసీల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ పనిచేస్తున్నదని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ టీడీపీ బీసీ విభాగం చేపడుతున్న జయహో బీసీ కార్యక్రమం శుక్రవారం క్లస్టర్-8 తోటపాలెంలో నిర్వహించారు.

200 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకమే లక్ష్యం

రామభద్రపురం: ఈ ఏడాది 200 ఎకరాల్లో పండ్లజాతి మొక్కలైన మామిడి, జీడి మామిడి, కొబ్బరి, సపోటా పెంపకానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఉపాధిహామీ పథకం ఏపీవో త్రినాథరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఉపాధిహామీ పథకం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 200 ఎకరాల్లో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల ద్వారా పండ్ల తోటలపెంపకం లక్ష్యంగా పెట్టుకున్నామని, కావాల్సిన వారు ఫీల్డ్ అసిస్టెంట్లను, టెక్నికల్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు. పనికి వచ్చే అన్ని కుటుంబాలకు వంద రోజులు పని కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలో 22 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు, మూడు పంచాయతీల్లో హౌసింగ్‌కు సంబంధించిన పనులు జరుగుతున్నాయన్నారు. 4,500 మంది కూలీలు హాజరయ్యారని, ఇంకా 7 వేల మంది కూలీలు హాజరయ్యేటట్లు లక్ష్యంగా తీసుకున్నామన్నారు. అన్ని గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు పనిలో ఉండాలని, రోజు వారి కూలీ 300 రూపాయలు వచ్చేటట్లు విధి విధానాలు రూపకల్పన చేశామన్నారు. పని ప్రదేశంలో కూలీలు తాగునీరు ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా చెరువు పనులతోపాటు కొత్త పనులు ట్రెంచి పనులు, పండ్లతోట పంట పనులు చేపడతామన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

● పార్టీలోకి ఆహ్వానించిన బేబీనాయన



పార్టీలో చేరిన వారితో బేబీనాయన, తెంటు

బొబ్బిలి, ఏప్రిల్ 5: తెర్లాం మండలం చీకటిపేట గ్రామసర్పంచ్ మూడడ్ల పార్వతి వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. బొబ్బిలికోటకు శుక్రవారం తమ అనుచరులతో సహా వచ్చి టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. ఆమెతోపాటు గ్రామానికి చెందిన మరో 22 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరడంతో వారందరికీ పార్టీ కండువాలు వేసి బేబీనాయన, తెంటు సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెర్లాం మండల పార్టీ అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు, సీనియర్ నాయకులు వెంకటేష్, మర్రాపు యుగంధర్‌తో పాటు చీకటిపేటకు చెందిన మూడడ్ల కిరణ్, చీకటి గాంధీనాయుడు, తిరుపతిరావు, రెడ్డి శంకరరావు, మూడడ్ల దాలినాయుడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

● డీఎస్పీ గోవిందరావు



ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 5: జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఎన్నికల నియమావళి పాటించాలని విజయనగరం డీఎస్పీ ఆర్ గోవిందరావు సూచించారు. శుక్రవారం వన్‌టౌన్ పరిధిలోని కామాక్షినగర్, కేఎల్‌పురం ప్రాంతాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తాము ఓటు హక్కుని ప్రశాంత వాతావరణంలో సద్వినియోగం చేసుకోవాలని, ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ముందస్తు చర్యల్లో భాగంగా అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేస్తున్నామన్నారు. వన్‌టౌన్ సీఐ వెంకటరావు మాట్లాడుతూ, వన్‌టౌన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించే వారిని గుర్తించి కౌన్సెలింగు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ వారి, వారికి కేటాయించిన ఎన్నికల కేంద్రం వద్ద శాంతియుతంగా ఓటు హక్కుని వినియోగించుకోవాలని సూచించారు. వన్‌టౌన్ ఎస్ఐ నవీన్ పడాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోండ్రు

వంగర: నాయకులంతా టీడీపీ విజయమే ధ్యేయంగా పనిచేయాలని రాజాం టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం తరగాంలో పలువురు సీనియర్ టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలగాం, శివ్వాం, రాజులగుమ్మడకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు కోండ్రు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు బోత్సవాసుదేవ రావు నాయుడు తదితరులు పాల్గొన్నారు. ● **రాజాం:** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కోండ్రు మురళీమోహన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల టీడీపీ నాయకులు శుక్రవారం ఆగూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వంగా వెంకటరావు, పార్లమెంటరీ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు గురవాన నారాయణరావు తదితరులు ఇంటింటికీ వెళ్లి గెలిపించాలని కోరారు. టంకాల పాపినాయుడు, మాడుగుల జయరాం తదితరులు పాల్గొన్నారు. పురపాక సంఘం పరిధిలోని బుచ్చింపేట గ్రామంలో పట్టణ టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ రాజాం పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు కోండ్రు చేశారన్నారు. టంకాల కన్నంనాయుడు. నాగరాజు. తదితరులు పాల్గొన్నారు. ముస్లిం మైనార్టీలకు టీడీపీ అండగా ఉంటుందని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం బొబ్బిలి రోడ్డులోని మసీదులో ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు.

కూటమి సమావేశంలో లలితకుమారి



సమావేశంలో లలితకుమారి

శృంగవరపుకోట ఏప్రిల్ 5: టీడీపీ, జనసేన, బీజేపీ పార్లమెంటరీ ఉమ్మడి సమావేశం శుక్రవారం విశాఖపట్నంలో జరిగింది. విశాఖ పార్లమెంటరీ నాయకులంతా పాల్గొన్న ఈ సమావేశానికి ఎస్.కోట కూటమి అభ్యర్థి కోళ్ల లలితకుమారి హాజరయ్యారు. విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు గండి బాజ్జీ అధ్యక్షతన ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వీరంతా చర్చించారు. పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి



సీతంపేట ఏరియా ఆసుపత్రిలో రోగులు

సీతంపేట: సీతంపేట ఏరియా ఆసుపత్రికి రోగులు తాకిడి పెరిగింది. వైరల్ జ్వర బాధితులతో వార్డులన్నీ కిటకిటలాడుతున్నాయి. అత్యధికంగా భామిని, కొత్తూరు, సీతంపేట మండలాల రోగులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గత వారం రోజుల నుంచి ఎండలు తీవ్రత పెరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రావిటేషన్ ఫ్లో ద్వారా తాగునీటిని వినియోగించే గిరిజనులు అత్యధికంగా రోగాల బారిన పడుతున్నారు. ఇటువంటి వారంతా సీతంపేట ఆసుపత్రికి క్యూ కడుతున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలోని రెండు వార్డుల్లో 30 బెడ్స్ ఉండగా.. అవి ఏ మాత్రం సరిపోని పరిస్థితి. దీంతో ఐసోలేషన్ వార్డుకు కేటాయించిన 50 బెడ్లలో పది బెడ్లను ఆసుపత్రి వరండాలో ఏర్పాటు చేసి రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రి రెండో ఫ్లోర్‌కు రూప్‌వే లేకపోవడంతో అది వినియోగానికి నోచుకోవడం లేదు. దీంతో రోగుల తాకిడి దృష్ట్యా ఐసోలేషన్ వార్డుకు మంజూరు చేసిన బెడ్లలో కొన్నింటిని ఇలా వినియోగిస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావును వివరణ కోరగా.. ప్రస్తుతం మంచాల సమస్య లేదన్నారు. బెడ్ల ఏర్పాటుకు అవసరమైన వార్డులు లేకపోవడం వల్ల అన్ని రకాల రోగులకు ఒకే దగ్గర వైద్యం అందించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

అధ్వానంగా పార్కు

● మాటలకే పరిమితమైన అధికారుల వాగ్దానాలు
● ఇదీ రాజాం వైఎస్ఆర్ పార్కు దుస్థితి

రాజాం, ఏప్రిల్ 5: పురపాలక సంఘం పరిధిలోని సారధి రోడ్డులో ఉన్న వైఎస్ఆర్ పార్కును అభివృద్ధి చేస్తామని అధికారులు ఇచ్చిన వాగ్దానాలు కేవలం మాటలకే పరిమితం అయ్యాయి. ఈ పార్కులో వ్యర్థాలు దారుణంగా ఉన్నాయి. పార్కు నిర్వహణను సరిగా చేపట్టకపోవడంతో పార్కుకు వచ్చిన ప్రజలు, పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కులో ఉన్న చెరువులో వ్యర్థాలు అన్నీ పేరుకుపోవడంతో చెత్తంతా కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ పార్కు విషయంలో సరైన చర్యలు తీసుకోమని అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని పార్కును అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

చెత్తను తొలగించడానికి ఏర్పాట్లు చేశాం

వైఎస్ఆర్ పార్కులో వ్యర్థాలను తొలగించడానికి మనిషిని ఏఆర్పటు చేశాం ప్రతి రోజు వ్యర్థాలను తొలగిస్తున్నాడు అయితే అంత ఎక్కువగా వ్యర్థాలు అక్కడ ఉన్న నీటిలో వేస్తున్నారని తెలియలేదు పూర్తిగా నీటిని సుభ్రం చేసే చర్యలు తీసుకుంటాం

- వెంకటేష్, ఏఈ, పురపాలక సంఘం, రాజాం



వ్యర్థాలతో నిండి పార్కులోని చెరువు

శివినిలో గడ్డివాములు దగ్ధం



అగ్నికి ఆహుతవుతున్న గడ్డి వాములు

కొమరాడ: శివిని గ్రామంలో శుక్రవారం గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామంలో అధికారి మోహనరావు, అధికారి వెంకటనాయుడు, గొర్జాన సత్యంనాయుడు, తదితర రైతులకు చెందిన సుమారు 20 ఎకరాల వరి గడ్డి వాములు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యాయి. వెంటనే పార్వతీపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక అధికారి టి.ఉమా మహేశ్వర్ ఆధ్వర్యంలో ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం

పార్వతీపురం రూరల్: మండలంలోని కృష్ణపల్లి గ్రామ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం శుక్రవారం లభ్యమైంది. దీనిపై రూరల్ ఎస్ఐ దినకరన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఉంచామన్నారు. మృతుని వయస్సు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతదేహాన్ని గుర్తించేందుకు సహకరించాలని, సమాచారం తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేసిన పోలీసులు

బొబ్బిలి, ఏప్రిల్ 5: బొబ్బిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ పరిధిలో గల రామభద్రపురం మండలం కరిందొర వలసలో 2200 లీటర్ల బెల్లం ఊటను శుక్రవారం ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ మురళీధర్ తెలిపారు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. బెల్లం ఊటను ధ్వంసం చేసి పదిలీటర్ల నాటుసారాను సీజ్ చేశామన్నారు. అనంతరం ఆ చుట్టుపక్కల గ్రామాల్లో కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. వంటసారా తయారీ, అమ్మకం, రవాణా వంటి కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు. ఈ దాడుల్లో తన వెంట ఎస్ఐలు ఎస్వీ రామారావు, ఎల్. తిరుపతిరావు, సిబ్బంది ఆదినారాయణ, ఇంటెలిజెన్స్ టీము రవికుమార్ తదితరులు పాల్గొన్నట్లు సీఐ తెలిపారు.

వడగాలులతో జాగ్రత్త: ఎంపీడీవో

బొబ్బిలి, ఏప్రిల్ 5: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అందరూ జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. స్థానిక మండల కార్యాయలంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ వడగాల్పులు చాలా ఎక్కువగా ఉన్నాయని, వాతావరణశాఖ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వీలైనంత వరకూ ఎండల్లో తిరగకుండా చూసుకోవాలని హితవు పలికారు. తాగునీరు, కొబ్బరినీళ్లు ఇతర శీతలపానీయాలు తాగాలన్నారు. శరీర ఉష్ణోగ్రతలను సమతుల్యంగా ఉంచుకోవాలని ఆయన అన్నారు. అనంతరం ఆయన మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించారు.

నైవేద్యమూ కరువే..

● దయనీయ స్థితిలో సంగమేశ్వర ఆలయం
● గాలిలోనే నాయకుల హామీలు



సంగమేశ్వర ఆలయం

వంగర: ఎన్నో ఆస్తులు ఉన్నా సంగమేశ్వర ఆలయంలోని సంగమేశ్వరుడు దీప దూప నైవేద్యాలకు నోచుకోవడం లేదు. ఇక్కడ దేవాలయ ఆస్తులు ప్రభుత్వ లెక్కల ప్రకారం 42 ఎకరాలు ఉన్నట్లు చెబుతున్నారు. వాటి నుంచి వచ్చే కౌలుతో పాటు ఏడాది కాలంలోని ప్రత్యేక పర్వదినాల్లో భారీగా యాత్రికులు వచ్చి దేవుడిని దర్శించుకోవటం వల్ల లక్షల రూపాయలు ఆదాయం సమకూరుతుంది. కానీ ఈ దేవాలయంలో సంగమేశ్వరుని పట్టించుకునే వారే కరువయ్యారు. నగావళిలో వచ్చే చిన్నపాటి వరదలకు కుడా నిత్యం ఆలయం మునిగిపోతుంది. ఈ క్రమంలో గత మహాశివరాత్రి పర్వదినాన ఆలయ దర్శనానికి వచ్చిన స్పీకర్ తమ్మినేని సీతారాం ఆలయ అభివృద్ధికి వెంటనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. నాగావళి నదినుంచి ఆలయం వరకు ప్రత్యేక రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. ఆలయ ఆస్తులు సర్వే చేసి బౌండరీలు గుర్తించాలని పాలకొండ ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశారు. ఐతే ఇవేవీ కార్యరూపం దాల్చలేదు. స్థానిక ఎమ్మెల్యే కంబాలజోగులు ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ఇచ్చిన హామీ గాలిలోనే కలిసిపోయింది. దీంతో సంగమేశ్వరుడు దయనీయ స్థితిలో ఉన్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దేవాలయ ఆస్తులపై దృష్టిసారిస్తే ప్రభుత్వ ఆస్తులు ఆదాతో పాటు ఆలయ అభివృద్ధి జరుగుతుందని పలువురు అంటున్నారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

ఆయుర్వేదం
★ బొల్లి, సొరియాసిస్ తెల్లమచ్చలు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఫ్రీగా ఇవ్వబడును. ఫోన్ : 9603055647, 7995392747.
AJG-2319

LAND FOR SALE
★ గుర్ల సమీపంలో 6 ఎకరాల భూమి అమ్మకానికి ఉంది. ప్రధాన రహదారి నుండి ఒక కి.మీ. మరియు విజయనగరం పట్టణం నుండి 14 కి.మీ. సంప్రదించండి. 8790012309 / 9908664019 AJH-002246

WANTED
» SOUS CHEF for Newly Opening Multi - Cuisine Restaurant in VIJAYAWADA, AP (South Indian, Chinese & Continental). Exp: 8 + Years, Qual Degree, Resume : m3344b@gmail.com
AJB-182035

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266

జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడు

● వాడవాడలా జయంతి కార్యక్రమాలు

● నివాళులు అర్పించిన వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

దివంగత నేత, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌ను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ఆయన జయంతి కార్యక్రమాన్ని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని కృషిచేసిన సంఘసంస్కర్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



విజయనగరం: నివాళి అర్పిస్తున్న డీబీఎస్‌యూ సంఘ ప్రతినిధులు



గజపతినగరం: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారం ప్రజా గ్రంథాలయంలో..



పార్వతీపురం టౌన్‌లో..



బొబ్బిలి: ఆకులరెల్లివీధిలో..



పాలకొండ: కస్పా వీధిలో



వీరఘట్టం: జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

మిమ్స్ హెచ్‌ఆర్ జీఎం ఇల్లు ముట్టడి

● మూడున్నర గంటలపాటు ఉద్రిక్తత



శ్రీనివాసరావు ఇంటి ముందు మిమ్స్ ఉద్యోగులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల మిమ్స్ ఉద్యోగులు ఆ సంస్థ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ ఎ.శ్రీనివాసరావు ఇంటిని శుక్రవారం ముట్టడించారు. జరజాపుపేటలోని ఆయన ఇంటికి వందలాది మంది ఉద్యోగులు చేరుకుని, తమ సమస్యలను పరిష్కరించాలని, పాత ఒప్పంద పత్రాలను తమకు అందజేయాలని డిమాండ్‌చేశారు. దీంతో హెచ్‌ఆర్‌తో పాటు ఆయన కుటుంబీకులు ఇంటి లోపలే ఉండిపోయారు. ఉద్యోగులు సుమారు మూడున్నర గంటల పాటు ఆయన ఇంటి వద్దే ఉండి నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న భోగాపురం రూరల్ సీఐ బి.వెంకటేశ్వరరావుతో పాటు నెల్లిమర్ల ఎస్ఐ రామగణేష్, డెంకాడ, పూసపాటిరేగ, గుర్ల ఎస్ఐలు కృష్ణమూర్తి, సన్యాసినాయుడు, హరిబాబునాయుడు సిబ్బందితో జరజాపుపేట చేరుకుని బందోబస్తు ఏర్పాటుచేశారు. సుమారు ఉదయం 11 గంటల సమయంలో మిమ్స్ ఉద్యోగులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేష్, రామారావులతో పాటు మిమ్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల అభివృద్ధికి కృషి చేస్తా



ప్రచారం చేస్తున్న మాధవి, బంగార్రాజు

నెల్లిమర్ల: ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని కూటమి అభ్యర్థి లోకం మాధవి అన్నారు. టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆమె బొడ్డపేట, వల్లూరు, మల్యాడ, ఒమ్మి గ్రామాల్లో ప్రచారం చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, గేదెల రాజారావు ప్రచారంలో పాల్గొన్నారు. కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులను నిలదీయాలి

గజపతినగరం: గ్రామాల్లోకి వస్తున్న వైసీపీ నాయకులను అక్రమాలపై నిలదీయాలని కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. కొత్తశ్రీరంగరాజపురం గ్రామంలో ఆయన శుక్రవారం ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. పార్టీ నాయకులు పీవీవీ గోపాలరాజు, మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్, శీరంరెడ్డి రాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి



మాట్లాడుతున్న కళా వెంకటరావు

చీపురుపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శుక్రవారం రాత్రి జరిగిన కూటమి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి నిరంకుశ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు సీఎం కావాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, రామ్మల్లిక్‌నాయుడు, బలగం వెంకటరావు, సారేపాక సురేష్, కోట్ల సుగుణాకరరావు, కరణం మురళీమోహనరావు, విమలారాణి పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

గజపతినగరం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో శుక్రవారం వేకువజామున స్థానిక జాతీయ రహదా రిపై సీఐ ఎస్‌వీ ప్రభాకర రావు, ఎస్ఐ యు.మహేష్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఒడిశా నుంచి వచ్చిన కార్లు, లారీలను తనిఖీ చేశారు. నగదు, పార్టీలకు సంబంధించి పరికరాలు తరలించకుండా నియంత్రణ చేపట్టే కార్యక్రమంలో భాగంగా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. మద్యం అక్రమ నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


బియ్యం పంపిణీలో వలంటీర్



బియ్యం పంపిణీలో పాల్గొన్న వలంటీర్ (సర్కిల్‌లో ఉన్న వ్యక్తి)

దత్తిరాజేరు: పప్పల లింగాలవలస గ్రామంలో ఒక వలంటీరు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎండీయూ ఆపరేటర్ గండి శంకరరావుతో కలిసి వాహనంతో గ్రామంలో కలియదిరిగారు. ● దీనిపై వలంటీర్‌ను వివరణ అడగ్గా, ఆపరేటర్ రెండు నెలలుగా విధులకు రాకపోవడంతో సహాయంగా వెళ్తున్నానని చెప్పారు. ఇకపై బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గోనని తెలిపారు. ● దీనిపై ఎంపీడీవో చంద్రకుమారి వివరణ అడగ్గా, వలంటీర్ బియ్యం పంపిణీ చేస్తున్నట్టు తనకు తెలియదని చెప్పారు. నిజమని నిర్ధారణ అయితే విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వీరఘట్టం: పట్టణంలోని రెల్ల వీధి, బీసీ కాలనీ సాయినగర్ కాలనీ, కొండవీటి గౌడ వీధి, తెలగవీధి, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ ఎస్కే ఫక్రుద్దీన్ మాట్లాడు తూ ఓటర్లు తమ ఓటు హక్కును ఎటువంటి భయానికి లోను కాకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కృష్ణంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

97 శాతం పింఛన్ల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలో 97 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో జగదీష్ తెలిపారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

చెట్ల కొమ్మల తొలగింపు

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి గరుగుబిల్లి మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా చేసే 33 కేవీ లైన్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను శుక్రవారం తొలగించారు. దీంతో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశామని మండల విద్యుత్‌శాఖ ఏఈ బి.శంకరరావు తెలిపారు.

కూటమితోనే సంక్షేమం



ప్రచారాన్ని నిర్వహిస్తున్న సంధ్యారాణి

మక్కువ: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కాశీపట్నం, కొండరేజేరు, కొత్తూరు గ్రామాల్లో ఆమె శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇస్తే సాలూరు నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి బి.గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

వెంకమ్మపేటలో భవిష్యత్తుకు గ్యారెంటీ



విజయచంద్రను స్వాగతిస్తున్న స్థానికులు

పార్వతీపురం రూరల్: వెంకమ్మపేట గ్రామంలో కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గొట్టాపు గౌరీశ్వరి, గొట్టాపు వెంకటనాయుడు, బోనుదేవి చంద్రమౌళి, జాగాన రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీల అడ్డగింత



ఇసుక ర్యాంప్ వద్ద యజమానులతో మాట్లాడుతున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది

పాలకొండ: మండలంలోని గోపాలపురం గ్రామం నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను గ్రామస్థులు శుక్రవారం అడ్డుకున్నారు. గ్రామస్థుల ఫిర్యాదుతో నాగావళి నది రేవు వద్దకు తహసీల్దార్, పోలీసు సిబ్బంది చేరుకున్నారు. ఇసుక అక్రమ రవాణా నిలిపివేయాలని ర్యాంప్ నిర్వాహకులకు ఆదేశించారు. గ్రామస్థులు మాట్లాడుతూ ఇసుక ర్యాంప్‌పై ఫిర్యాదు చేసినా నిర్వాహకులు పట్టించుకోవడ లేదన్నారు. యథేచ్ఛగా రవాణా చేస్తున్నారన్నారు. గ్రామస్థులు నిలదీయడంతో లారీలలోని ఇసుకను బయటకు వేసి పరారయ్యేందుకు లారీ యజమానులు సిద్ధం కావడం విశేషం. గ్రామస్థులు లారీలను, జేసీబీని అడ్డుకుని నిరసన తెలిపారు. అధికారులు వచ్చేంతవరకు వాహనాలను విడిచిపెట్టబోమన్నారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది రావడంతో గ్రామస్థులు శాంతించారు.

అమృత భూమి చిత్రానికి ఉగాది పురస్కారం

గరుగుబిల్లి: తోటపల్లిలోని జట్టు సంస్థ రూపొందించి చిత్రీకరించిన అమృత భూమి చలన చిత్రం ఉగాది పురస్కారానికి ఎంపికైందని సంస్థ వ్యవస్థాపకుడు డా.డి.పారినాయుడు, ట్రస్టీ ఆర్.వాసుదేవరావు తెలిపారు. శుక్రవారం వీరు స్థానిక విలేకర్లకు ఈ విషయాన్ని వెల్లడించారు. ఏపీ ఫిల్మ్ చాంబర్ ప్రధాన కార్యదర్శి జేవీ మోహన్‌గౌడ్ ఈ సమాచారం అందించారని, ఈనెల 7న మంగళగిరిలో హ్యాపీ రిసార్ట్‌లో పురస్కారం అందిస్తారని తెలిపారు.

ప్రశాంత పోలింగ్‌కు సహకరించండి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలకంఠం

కొమరాడ: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని కొమరాడ ఎస్ఐ నీలకంఠం అన్నారు. శుక్రవారం నయా పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేర్లు లేని 18 ఏళ్లు నిండిన వారంతా ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బియ్యం పంపిణీ పరిశీలన



బియ్యం పంపిణీ పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనందరావు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రం పార్వతీపురంలో రేషన్ బియ్యం పంపిణీ విధానాన్ని పార్వతీపురం తహసీల్దార్ ఆనందరావు శుక్రవారం పరిశీలించారు. నిబంధన ప్రకారం పంపిణీ చేస్తున్నారని ఆయన ఈసందర్భంగా చెప్పారు. వలంటీర్లు లేకుండా పంపిణీ ఎటువంటి లోటుపాట్లు లేకుండా చేపట్టాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్య క్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోటదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వీరఘట్టం: పట్టణంలోని శ్రీకోట దుర్గమ్మ(భవానీ దేవి) దేవాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ శర్మయాజీ ఆధ్వర్యంలో యజ్ఞయాగాలు నిర్వహించారు. ఈ పూజల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

సీతారాముల కల్యాణ మహోత్సవానికి పందిరిరాట



పందిరి రాట కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సాలూరు రూరల్: క్రోధి నామ సంవత్సరం చైత్ర మాస నవమి రోజు జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవా నికి, శ్రీరామనవమి వసంత నవరాత్రి ఉత్సవాల కోసం శుక్రవారం సాలూరులో ఉత్సవ అంకురార్పణ, పందిరి రాట కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు డబ్బివీధి రామమందిరం వద్ద పూజా కార్యక్రమాలు చేశారు. వివిధ రామ మందిరాల వద్ద పందిరి రాటలు, రామోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

జల గ్రామానికి తాగునీటి సౌకర్యం



బోరుకు హెడ్, హ్యాండిల్ బిగిస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొమరాడ: మండలంలోని పెదశాఖ పంచాయతీ జల గ్రామంలో గిరిజనులు తాగునీటి కోసం ఎదుర్కొంటున్న సమస్యలను ఈనెల 2న ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు గ్రామానికి వేసిన బోరుకు హెడ్, హ్యాండిల్ బిగించి తాగునీటిని అందించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ నాగేశ్వరరావు, ఏఈ నవీన్‌కుమార్ గ్రామానికి వెళ్లి గ్రామస్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను గుర్తించారు.

నేటి నుంచి అభయహస్తం పింఛన్ల పంపిణీ

సాలూరు రూరల్: అభయ హస్తం పింఛన్లకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ పింఛన్లు పంపిణీ కోసం నిధులు పంచాయతీల ఖాతాల్లో శుక్రవారం జమయ్యాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో 4,633 మంది అభయహస్తం పింఛనుదారులున్నారు. వారికి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పింఛను అందించనున్నారు. సామాజిక పింఛన్లు పంపిణీకి నిధులు జమైనా అభయహస్తం పింఛనుదారులకు నగదు జమకాలేదు. దీంతో వారికి పింఛన్లు ఇవ్వలేదు. వారికి కూడా పింఛన్లు ఇవ్వడానికి రూ.23,16,500 పంచాయతీల ఖాతాల్లో జమయ్యాయి. దీంతో వారికి శనివారం పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

క్లుప్తంగా..

గుండెపోటుతో వీఆర్వో మృతి

సాలూరు: సాలూరు పట్టణంతో పాటు గుమడాం వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న గోర్ల శ్రీరాములు(57) గురువారం రాత్రి గుండెపోటుతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతిచెందారు. ఈయన స్వగ్రామం సాలూరు మండలం పెదబోరబంద గ్రామం. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బీసీల ద్రోహి జగన్‌రెడ్డి

గరుగుబిల్లి: వెనుకబడిన వర్గాలను అధికార దాహంతో అణగదొక్కుతున్న ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని తరిమికొట్టాలని అరకు టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు బి.రామ్మోహనరావు కోరారు. శుక్రవారం ఆయన గరుగుబిల్లిలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బీసీలకు ద్రోహం చేసిన జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు.

కూటమి విజయం ఖాయం

పాచిపెంట: రానున్న ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమని టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆశాభవం వ్యక్తంచేశారు. పణుకువలసలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముఖి సూర్యనారాయణ, నాయకులు కె.పోలినాయుడు, జి.యుగంధర్, డి.మోహనరావు, పారమ్మ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కొమరాడ: వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టీడీపీ నాయకులు మధుసూదనరావు, సుదర్శనరావు కోరారు. శుక్రవారం కొమరాడ మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటనాయుడు, కృష్ణంనాయుడు, బి.వేణు, జి.త్రినాథం, దత్తి ధర్మ, ఎం.సింహాచలం, తిరుపతినాయుడు, బలరాం, ఎం.కిరణ్, చినఖేర్జిల సర్పంచ్ గంగాధర్, బీజేపీ నాయకులు సురేష్, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సాలూరు రూరల్: మామిడిపల్లి విద్యుత్ 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు నిర్వహణ పనుల వల్ల మామిడిపల్లి, గంగన్నదొరవలస విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ వీవీ కిశోర్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కొఠియాలో ఒడిశా సీఎస్ పర్యటన

సాలూరు రూరల్: సాలూరు మండలం కొఠియాలో ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ జెనా, ఒడిశా వ్యవసాయశాఖ రాష్ట్ర కార్యదర్శి అరవింద్ పాడి శుక్రవారం మెరుపు పర్యటన చేశారు. ఇరు రాష్ట్రాల్లో ఒకే రోజు పోలింగ్ ఉండడంతో అధిక శాతం పోలింగ్‌కు ఒడిశా పట్టుబిగిస్తున్నది. ఈనేపథ్యంలో ఒడిశా అధికారులు శుక్రవారం కొఠియాలోని పలు పాఠశాలలను, స్ట్రాబెర్రీ సాగు, కొఠియా పంచాయతీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఆసుపత్రి, అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించి వెళ్లారు. కొఠియా గ్రూపు 21 గ్రామాల గిరిజనులు అధికులు తమ రాష్ట్ర ఎన్నికల్లో పాల్గొని ఓటు వేశారని రుజువు చేసుకునేందుకు ఒడిశా కార్యాచరణకు దిగినట్టు పలువురు భావిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

తాగునీటి సమస్యను పరిష్కరించండి

● కలెక్టర్ కార్యాలయం వద్ద ఆర్జణ గ్రామస్థుల ఆందోళన

ఒడిశా



కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన గ్రామస్థులు

రాయగడ: కారుబాయి పంచాయతీ ఆర్జణ గ్రామ ప్రజలు తమ గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడి సమస్యను తీర్చమని కోరుతూ జిల్లా కేంద్రంలోని సమితి కార్యాలయంలో బీడీవో అమూల్య సాహుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఉన్న మూడు బోర్లు పడకేసి చాలా కాలం అయిందని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. వేసవిలో చాలా ఇబ్బందులు పడుతున్నామని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. విధి లేని పరిస్థితిలో కొండల నుంచి జాలువారుతున్న ఊట నీటిని వాడుతున్నామని దీంతో పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్‌కు వినతిపత్రం అందజేశారు. వారి సమస్యలను విన్న కలెక్టర్ త్వరలో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఉగాది వేడుకలకు డ్యాన్స్ ఎంపిక పోటీలు



ఆడిషన్స్ నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: ఉగాది సందర్భంగా నిర్వహించనున్న వేడుకలకుగాను స్థానిక తేజస్వీ హోటల్‌లో శుక్రవారం డ్యాన్స్ ఆడిషన్స్(ఎంపిక పోటీలు) చేశారు. బిజద ఉపాధ్యక్షుడు, పూర్వ రాజ్యసభ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో వేడుకలు జరగనున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పోటీలు నిర్వహించారు. పాల్గొన్న ప్రతిఒక్కరికీ బహుమతులు అందజేశారు.

